# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు





# -29-

## 'క్షోభా'యమానం గా జరిగిన అమెరికా సంబడాలు

కంగారు పడకండి. ఈ కథ మకుటం అప్పుతచ్చు కాదు. నిజానికి మే నెల 24-26, 2019 తారీకులలో డాలస్ లో జరిగిన 6 వ నాట్స్ సంబరాలు శోభాయమానంగానే జరిగాయి. ఎందుకంటే రెండు రోజుల సాహిత్య వేదికలో మూడే మూడు పూర్తి స్థాయి ప్రసంగాలు ఉండగా వాటిల్లో రెండు ఇండియా నుంచి వచ్చిన వాళ్ళవి కాగా అమెరికా వాళ్ళది నా ఒక్కడిదే. నన్ను అంత గౌరవంగా చూసుకున్నారు కాబట్టే ఆ సభలు శోభాయమానంగా జరిగాయి అని ప్రవచించాను కానీ నిజానికి నా పాలిట కాస్త "క్షోభాయమానం" గా జరిగాయి. అంటే రకరకాల క్షోభలన మాట. అసలు ముందుగా ఆ సభల సాహితీ వేదిక నిర్వాహకులు నన్ను రమ్మని ఆహ్వానించడంతో ఈ క్షోభా పరంపర మొదలయింది. మరెక్కడో అయితే ఏమో కానీ ఈ సభలు డాలస్ లో కాబట్టిన్నీ, అక్కడ మా ఏడాది దాటిన మనవరాలు రెండు వారాల క్రితమే బుడిబుడి అడుగులు వెయ్యడం మొదలు పెట్టింది కాబట్టిన్నీ, అవి చూడడానికి వెళ్దాం అనీ నిర్ణయించేసుకున్నప్పటికిన్నీ, వాళ్ళు అడిగిన వెంటనే ఒప్పేసుకుంటే నాకింకేం పని లేదు అనుకుంటారేమో అని ఆ నిర్వాహకుడి గారికి "ఆలోచించి చెప్తాను" అన్నాను....ముత్యాల ముగ్గులో "రేటుల లిస్టు చూసి చెప్తాను" అని రావు గోపాల రావు టైపులో.

అంతే. ఆ మర్నాటి నుంచీ ఆ నిర్వాహక మిత్రుడు వాట్సాప్ లో 'వస్తవా, చస్తవా" అని "తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ చచ్చుడో" టైపులో.

ఇక తప్పక "వస్తాను, బాబోయ్" అని చెప్పగానే

"దేని గురించి మాట్లాడతావ్?" అని మళ్ళీ తగులుకున్నాడు ఆ మంచి మానవుడు.

నేను మళ్ళీ "ఆలోచించి చెప్తాను" అన్నాను కానీ ఆయన ఈసారి

"అక్కర లేదు. మీరు సాహిత్యంలో హాస్యం గురించి మాట్లాడుతున్నారు" అని చెప్పేశాడు.

నేను సరే అనే లోపుగానే ఇంకో వాట్సాప్ లో "నీ ఫోటో పంపించు. నాలుగు వాక్యాలలో నీ బయో డేటా పంపించు" అంటూ నిర్వాహకులలో మరొక ఆయన తగులుకున్నాడు. ఆయనా మంచి వాడే అయి ఉంటాడు అయినా నా అంతటి వరల్డ్ ఫేమస్ వాడినీ, చంద్ర బాబు లాగా 40 ఇయర్స్ ఇండస్ట్రీనీ పట్టుకుని ఫోటోలు, బయోలు అడగడం ఏమిటీ, ఆ మాత్రం గూగుల్ లో చూసుకోలేడా అని మొదటి సారి క్షోభ పడ్డాను.

"పంపించక పోతే ఏంచేస్తారులే గాడిద గుడ్డు" అనుకుని ఆ మాటే మా క్వీన్ విక్టోరియాతో అనగానే ఆ మహాతల్లి అర క్షణం కూడా ఆలోచించకుండా "ఏం చేస్తారా. ఫోన్ చేసి నువ్వు రావక్కర లేదులే. నీ లాంటి వరల్డ్ ఫేమస్ వాళ్ళు మా ఊళ్లోనే చాలా మంది ఉన్నారు అని నీకు చెప్పకుండానే నీ పేరు లిస్టు లోంచి కొట్టేస్తారు. వాళ్ళ ప్రకటనలలో జగన్ మోహన్ రెడ్డి లా పదేళ్ళ ఇండస్ట్రీ వాళ్ళ ఫోటోలు ఉంటాయి. అది తెలియక నువ్వు తోక జాడించుకుంటూ అక్కడికి వెళ్ళగానే వాళ్ళు ఆశ్చర్య పోయి నిన్ను ప్రతిపక్షం బెంచీలో కూచోబెడతారు" అని విలాసంగా నవ్వింది. అసలు ఆ నవ్వు చూసే అలనాడు ఆవిడని పెళ్ళాడినా, ఈ నాడు ఒళ్ళు మండింది.

మొత్తానికి నా సుందర ముఖారవిందం అనేక రంగులలో కనపడుతున్న నా డ్రైవర్ లైసెన్స్ ఫోటోనీ, అగ్గి పెట్టెలో పట్టు చీరలా నాలుగు వాక్యాలలో నా జీవితం గురించీ సదరు నిర్వాహకులకి వాట్సాప్ లో బట్వాడా చేశాను. ఇక నాకు అధికారిక ఆహ్వానం ఎప్పుడు వస్తుందా అని అరగంట కి ఒకసారి నా వాట్సాప్, ఫోన్ మెసేజీ, మిస్సిడ్ కాల్సూ, ఈమెయిలు ఇలా అన్ని మాధ్యమాలలోనూ ఎంత వెతికినా అది కనపడక రెండో సారి క్షోభ పడ్డాను.

ఇక లాభం లేదు అనుకుని “నాకు హోటల్ ఇస్తారా, చస్తారా, దారి ఖర్చులకి పారితోషికం ఎంత ఇస్తారూ, నా ప్రసంగానికి ఒక గంట సమయం ఇస్తారా?“ మొదలైన ప్రశ్నలతో టిట్ ఫర్ టాట్ లాగా నేనే వాళ్ళని తగులుకున్నాను.

ఆయన కూడా గోడకొట్టిన బంతి లా ఆ నిర్వాహకుడు గారు “ఆలోచించి చెప్తాను, పెద్ద కమిటీ వాళ్ళని అడగాలి కదా” అన్నాడు.

నా దగ్గర నుంచి నాలుగు వాట్సాప్ ల తరువాత “ఆఖరికి మీరు కూడా ఏమిటి సార్. మీరే మాకు వెయ్యి డాలర్లు విరాళం ఇస్తారేమో అని ఆహ్వానిస్తే ఇలాంటి గొంతెమ్మ కోరికలా? మీ ఒక్కరికీ ఉచిత ప్రవేశం ఇస్తాం, భోజనం పెడతాం. అంతే, హోటల్, గిటేల్, డాలర్స్ జాంతానై, ప్రసంగానికి పదిహేను నిముషాలు, బస్” అని “వస్తే రా, లేక పోతే మానెయ్” అన్నట్టుగా తెగేసి చెప్పేశాడు.

అప్పుడు నాకు మూడోసారి క్షోభా, మొదటిసారి పెద్ద అనుమానమూ కలిగాయి.

ఆ నిర్వాహకుడి గారి “మీ ఒక్కరికీ” అనే 'స్టోన్' లో ఏదో అపశ్రుతి వినపడింది. వాళ్ళు ఆహ్వానించినది నన్ను ఒక్కడినే అయితే, తీరా నా చొక్కా పట్టుకుని మా క్వీన్ విక్టోరియా కూడా వస్తే అక్కడ గుమ్మం దగ్గర కాపలా ఉండే తాటకి మరియు శూర్పణఖలు ఆవిడని అక్కడే ఆపేసి చేతికి VIP పటకా ఉన్న నా ఒక్కడినే లోపలికి వెళ్ళనిస్తే మా 40 ఏళ్ల వివాహ బంధానికి తూట్లు పడవా అనేదే నా పెద్ద అనుమానం. ఇక ఆ రాత్రి నిద్ర పట్టక, మర్నాడు పొద్దున్నే సదరు నిర్వాహక మహాశయుడిని పిలిచి

“నాకు ఉచిత ప్రవేశం కలిగించి, ఉచితముగా భోజనము పెట్టి ఆహ్వానిత అతిధిగా ఎంతో గౌరవము చేసినందులకు కృతజ్ఞుడను. మరి నాతో మా సహ ధర్మచారిణి –ఒకరిని విడిచి ఒకరు ఎప్పుడూ విడిచి ఉండము– అని మేము అగ్ని సాక్షిగా చేసిన మా పెళ్లి నాటి ప్రమాణాల ప్రకారం తను కూడా వచ్చును. మరి ఆవిడని లోపలికి అనుమతింతురా, కనీసం ఒకే పేపరు పళ్ళెంలో ఇద్దరం సద్దుకుని ఉచిత భోజనం చెయ్యవచ్చునా?” అని అడిగాను.

దానికి ఆయన ”అసలు మీకు పెళ్లయిందా ?” అన్నంతగా బిత్తర పోయాడు.

యధాప్రకారం “ఆలోచించి చెప్తాను. మా పెద్ద కమిటీని అడగాలిగా “ అనగానే మనకి ఇద్దరికీ ఒకే ఉచిత పేపర్ కంచం లభించదు అని విషయం అర్ధం అయిపోయింది. అది నాలుగో క్షోభ.

ఇక తప్పదులే అని సభా ప్రవేశానికి ఆవిడ పేరిట వేరే నమోదు, పేపర్ కంచం వేరేదే అయినా కలిసి ఉండడానికి హోటల్ గది ..అన్నీ కలిపి తడిపి మోపెడు ఖర్చుతో నేను ఆహ్వానిత అతిధినీ, మా క్వీన్ విక్టోరియా నా ఆహ్వానిత అతిథీ అయ్యాం. దీని అర్ధం ఏమిటంటే “ఎక్కడయినా బావవే కానీ వంగ తోట దగ్గర కాదు” అన్నట్టు ఈ అమెరికా సంఘాల కార్యక్రమాలలో ఆహ్వానిత అతిధి గౌరవం, మర్యాదలు బావుంటాయి కానీ..ఆ ఒక్కటీ అడక్కు. డాలర్లు ఖర్చుపెట్టమనకు. చెప్పొద్దూ.....బల్లకి అటు వేపూ, ఇటు వేపూ ఉండి ఈ ఆటలన్నీ నేనూ ఆడుకున్నవే కాబట్టి నాకు నిజంగా చెప్పాలంటే ఏ విధమైన క్షోభా లేనే లేదు. ఏదో సరదా క్షోభ..అంతే!.

మొత్తానికి డాలస్ లో NATS సంబరాలు బాగానే జరిగాయి. తానా, ఆటా, నాటా, తెలంగాణా ఆటా లాంటి అనేక మహా సభలకి నేను చాలా వాటికి, చాలా నగరాలలో వెళ్ళినా NATS సంఘం వారి సభలకి వెళ్ళడం నాకు ఇదే మొదటి సారి. మన తెలుగు సినిమాల లాగా అన్నీ ఒక్కలాగానే ఉంటాయి. కోట్లు ఒకటే కానీ అవి వేసుకున్న వారు మాత్రం వేరు. అంతే. అయితే సాహితీ వేదిక నిర్వాహకులు, వక్తలు, సినీ రచయితలు, శ్రోతలు..ఇలా ఇంచుమించు అందరూ నాకు తెలిసిన వారే కానీ NATS సంస్థ అధ్యక్షుడు, కన్వీనర్ లాంటి వందలాది అధికారులలో ఒక్కరంటే ఒక్కరు కూడా నాకు తెలియదు. తరం మారింది అనడానికి ఇదే నిదర్శనం.

ఇంతకీ ఈ రోజుల్లో తెలుగు వారి అసలు సిసలు క్షోభ ఏమిటంటే... మరణశయ్య మీద ఉన్న తెలుగు భాషా, సాహిత్యాలకి మనం మళ్ళీ ఊపిరి పోసే అవకాశం ఉందా అనేదే....ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్ లో కొత్త ప్రభుత్వం వచ్చింది కాబట్టి ఈ విషయం మీదనే నా ప్రసంగంలో కొన్ని సూచనలు చేశాను. అవి శ్రోతలని క్షోభ పెట్ట లేదు సరి కదా...చాలా మంది వారివారి ఆలోచనలని నాతో పంచుకున్నారు...ఈ అవకాశం నాకు ఇచ్చిన NATS వారికి నెనరులు.

**COMMENTS**